


# ఏ కళ్ళు చూసినా

## జె. నాగభూషణ రావు

నిజామాబాద్ బస్ స్టాండ్.

కార్తీకమాసం చలిని చీల్చుకుంటూ కాసే సన్నని ఎండ ఒకరకమైన వింత అనుభూతిని కలిగిస్తోంది. మధ్యాహ్నం మూడుగంటల బస్‌లో వెళ్ళాలని అరగంట ముందే వచ్చిన ఉష మనసు నాలుగు గంటలయినా బస్సు రాకపోయే సరికి చిరాకు పడుతోంది.

పెద్దవాళ్ల నిట్టూర్పులు, పసిపిల్లల ఏడ్పులు, ముష్టివాళ్ళ సాధింపులతోనూ అసలే చిరాకు వున్న ఉషకి 'ప్రజాసేవయే మా ప్రథమ కర్తవ్యం' అన్న ఆర్‌టిసి వారి నినాదం గుర్తుకు వచ్చి అరికాలిమంట నెత్తికెక్కింది.

తొమ్మిదవసారి రిస్టువాచ్ వంక చూసుకొంటుండగా హైదరాభాద్ బస్సు పెళ్లివారి నడకతో వచ్చింది.

అన్ని సీట్లకు ముందే రిజర్వేషన్ అయిపోవడంతోనూ, స్టాండింగ్ పాసింజర్లని ఎక్కించవని కండక్టర్ సెలవివ్వడంతోనూ అట్టే తోపుడు లేకుండా లోపలికి ఎక్కి తన సీట్లో కూర్చుని వి.ఐ.పి బ్రీఫ్ కేస్‌ని పక్కన పెట్టుకుంది.

సరీగా బస్ కదలబోయెసమయంలో ఒకతను ఎక్కి వచ్చి తన వెనక సీట్లో కూర్చున్నాడు. మనిషి ఎర్రగా బుర్రగా ఒడ్డూ పొడుగు బాగానే వున్నాడు. కానీ వేసుకున్న నల్లని పాంటు దానికి మేచ్ అయేనల్లని షర్టు వొత్తుగా పెరిగిన జుత్తు, గడ్డం చూస్తుంటే ఒళ్లు జలదరించింది. కనీసం కాళ్లకు జోళ్లైనా లేవు.

డిచ్‌పల్లి రైల్వే క్రాసింగ్ దాటి బస్సు ముందుకు పోతోంది.

ఒకసారి తను వెనక్కి తిరిగి చూసింది. అదే సమయానికి గడ్డంవాలా కూడా తన వంక చూసి అంతలోనే కళ్లు మూసుకొని ఏదో గొణుక్కోవడం ప్రారంభించాడు.

ఎవరైనా సరే ఒకసారి తన కళ్లలోకి సూటిగా చూశారంటే వెంటనే దృష్టి మరల్చుకోలేరు. తన కాలేజీ డేస్‌లో ఎంతమంది తన ప్రాపు కోసం పాకులాడేవాళ్లో తలచుకుంటే నవ్వొచ్చింది. అలాంటిది ఏమిటిది తనని చూసీ చూడగానే కళ్లు మూసుకున్నాడు. పెద్ద ఫోజుకాబోలు. అయినా ఆ డ్రెస్‌తో కాళ్లకు కనీసం చెప్పులైనా లేని వాడి గురించి తను ఆలోచించడం ఏమిటి అనుకున్నప్పటికీ ఎక్కడో తన అహం కాస్త దెబ్బతిని చూపులు మరల్చుకుంది.

వుండి, వుండి వెనకనుంచి సన్నని గొణుగుడు మాత్రం వినిపిస్తూనే వుంది. ఫూల్? అందాన్ని చూసి ఆనందించలేనివాడు అంతకన్నా ఏం చేయగలడు అనుకొని తృప్తిపడింది.

అంతలో బస్సు కామారెడ్డి వచ్చింది. కాఫీ చాయ్‌ల కోసం పదిహేను నిమిషాలు ఆగింది. దాదాపు అందరూ దిగి తమ తమ అవసరాలు తీర్చుకొని వచ్చారు. కానీ ఈ నల్ల బుద్ధావతారం మాత్రం ధిగలేదు. అవును మరి కాళ్లకి చెప్పులైనా లేనివాడి దగ్గర కాఫీకి యెక్కడి నుంచి వస్తాయి అనిపించి జాలి వేసింది.

నిజామాబాద్‌లో స్టాండింగ్ పాసింజర్లని ఎక్కించని కండక్టర్‌కి కామారెడ్డిలో తప్పిందికాదు. ఎప్పటి నుంచీ వెయిట్ చేస్తున్నారో మరి గట్టిగా గోల చేసేసరికి దాదాపు ఇరవైమంది వరకూ తోసుకొని ఎక్కారు.

నిండు గర్భిణిలా బస్సు ఊగుతూ కదిలింది.

ఎవరో మధ్యవయస్కురాలు రెండేళ్ల పాపను ఎత్తుకుని తన ముందుగా నిలబడివుంది. ఏమిటో పిల్లలని కూడా ఎత్తుకోని నిలబడిరాకపోతే మరో బస్సులో రాకూడదు. అంతవరకూ హాయిగా వచ్చిన తమకి ఇంతమంది కూరుకుని ఎక్కడంతో గాలి ఆడక భలే విసుగ్గా వుంది.

"అమ్మా? మీరు వచ్చి ఇలా కూర్చోండి"

తను వెనక్కి చూసేసరికి గడ్డంవాలా లేచి నిలబడి తన సీటు పాపను ఎత్తుకున్న ఆమెకు ఇస్తున్నాడు. ఆమె మొహమాట పడుతూ కూర్చుని కృతజ్ఞతగా అతనివంక చూసింది. ఎవరు చూసినా ఒకటే. తలవంచుకుని అతని లోకంలో అతనున్నాడు.

అక్కడికి తనేదో పెద్ద త్యాగం చేసినట్లు నలుగురూ అనుకోవాలని కాకపోతే ఇంతమంది వుండగా తనే లేచి సీటు ఇవ్వాలా. కాళ్లకి ఘూ అయినా లేకుండా హైదరాబాద్ వరకూ నిలబడి వస్తే తిక్క కుదురుతుంది అనుకుని తృప్తి పడింది.

బస్ రాణీగంజ్ రాగానే అతనుదిగి అలా నడుచుకుంటూ టాంక్‌బండ్ వైపు వెళ్లిపోయాడు.

ఎంతవద్దనుకున్నా ఆలోచనలు అతని చుట్టూ తిరుగుతున్నా అంతటితో అతని గురించి మరచిపోయింది.

* * *

వారం రోజులు తరువాత కోటీలోని 'మంగళదీప్'లో షాపింగ్‌కని వెడితే కాలేజ్‌మేటూ, క్లోజ్ ఫ్రెండూ అయిన ఉమ కనిపించి "ఏం ఉషా పదిహేను రోజులలో వచ్చేస్తానని నెలపైగానే కాంపు వేశావు అన్నయ్య 'గారింట్లో. వదిన బాబు కులాసాగా వున్నారా! బాబెవరి పోలిక? సారీ ఉషా బారసాలకి రాలేకపోయాను. ఆ సమయానికి ఆయన బొంబే కాంప్‌కి వెళ్లారు. రేవతికి, కవితకి పరీక్షలు...."

"ఆ? కారణాలు చెప్పమంటే సవాలక్ష చెబుతావు. నీ మీద నాకు చాలా కోపం వచ్చింది. అందుకే వచ్చి వారం అయినా నీకు ఫోన్ కూడా చేయలేదు." అంటూ ఆలక వెళ్లబోసుకుంది.

"కారణ చెప్పింతరువాత కూడా కన్విన్స్ కాకపోతే ఎలాగే. పోన్లేగానీ ఎల్లుండి ఆదివారం మా కాలనీలో తెలిసిన వారి ఇంట్లో శ్రీ అయ్యప్పస్వామి పూజ వుంది. ఉదయం ఏడు గంటలకల్లా శ్రీవారిని కొంగుకు కట్టుకుని వచ్చేయ్యి. పూజ చాలా బాగుంటుంది. భోజనాలు కూడా అక్కడే చేసి సాయంకాలం వెళ్లవచ్చు"

బాగుంది నీ వరస. మా అన్నయ్యగారింట్లో ఫంక్షన్‌కి రాలేదుగానీ పిలవని పేరంటంగా మీకు తెలిసిన వాళ్లింటికి రమ్మని పిలుస్తున్నావా."

"అదికాదే. అయ్యప్ప స్వామి పూజకు ఎవరూ పిలవక్కరలేదు. ఎక్కడ జరుగుతున్నా ఎవరైనా వెళ్ళవచ్చు. మీరు తప్పకుండా రండి. అన్నీ మీకే తెలుస్తాయి" అని తన చేత ప్రామిస్ తీసుకుంది.

అయ్యప్పస్వామి పేరు మాత్రం వింది గానీ అంతకు మించి ఏ వివరాలు తన కింతవరకూ తెలియదు.

అంత గట్టిగా రమ్మన్నది గదా అని ఆదివారం ఉదయం ఏడున్నరకల్లా శ్రీపతిని వెంటబెట్టుకుని ఉమా వాళ్లింటి ముందు స్కూటర్ దిగింది. అప్పటికే ఉమ, వాళ్ళ ఆయన, పిల్లలు అంతా రెడీ అయి తమ కోసమే చూస్తున్నారు.

అంతా కలిసి పూజ జరుగుతున్న వాళ్లింట్లోకి వెళ్ళారు.

అప్పటికే వందకు పైగా అయ్యప్పస్వామి భక్తులతో ఆ ఇల్లు కిటకిటలాడుతూ కళకళలాడుతూంది. అన్ని గుమ్మాలకూ మామిడాకులు, బంతి, చేమంతులతో తోరణాలు కట్టారు.

వరండా దాటి హాలులో ప్రవేశించేసరికి కలియుగ వైకుంఠంలా గోచరించింది. తూర్పుముఖంగా శ్రీ అయ్యప్పస్వామి ఫోటోని ఎత్తుగా అందంగా ఎన్నో రకాల పూలతో అలంకరించారు. ఆ స్వామికి కుడివైపు గణపతి ఎడంవైపు లక్ష్మీ అమ్మవారి ఫోటోలు కూడా కన్నుల పండుగగా అలంకరించారు.

ఆ ఫోటో ముందు చెక్కతో చేసిన మెట్లులాగా

**హారతివ్వగానే దాదాపు పదిమంది అయ్యప్ప భక్తురాళ్లు కోలాటం వేస్తూ భక్తిగీతాలను అతి శ్రావ్యంగానూ హృద్యంగానూ పాడి వినిపించారు. వేరే ఫంక్షన్స్‌లోలాగ కేకలు హడవుడి లేకుండా నిశ్శబ్దంగా చూస్తూండిపోయారు.**

వున్నాయి. వాటిని పదునెట్టాం పడి అంటారని శబరిమలైలో స్వామి ఆలయానికి అలాంటి మెట్లే ఎక్కి వెళ్ళాలనీ, ఆ స్వామి దీక్షలో వున్నప్పుడు పాటించవలసిన నిష్ఠ నియమాలు అన్నీ ఉమ చెప్పింది.

పదునెట్టాం పడికి ముందు మూడు పెద్ద పెద్ద కుందులలో జ్యోతులు వెలిగించి వాటికి కూడా ఎంతో దివ్యమైన అలంకారం చేశారు.

వచ్చిన వాళ్ళలో మళయాళీలు, అరవ, కన్నడ తెలుగు వాళ్ళలో ఎవరు ఎవరో గుర్తు పట్టడానికి వీలులేకుండా అంతా ఒకే మాదిరిగా నల్లని లుంగీలతో పెరిగిన గడ్డాలతో మెడలో మాలలతో ఎవరినోట విన్నా 'స్వామి శరణం' అన్న శరణఘోషతో అదోక అయ్యప్ప తరంగ ప్రవాహంలా వుంది.

పూజా కార్యక్రమం అంతా దాదాపు మూడుగంటలు పట్టింది.


హారతి ఇవ్వగానే దాదాపు పదిమంది అయ్యప్ప భక్తురాండ్రు కోలాటం వేస్తూ భక్తి గీతాలను అతి శ్రావ్యంగానూ హృద్యంగాను పాడివినిపించారు. వేరే ఫంక్షన్స్‌లో లాగే కేకలు హడావిడి వగైరాలు ఏవీలేకుండా అందరూ నిశ్శబ్దంగా చివరివరకూ చూస్తూ వుండిపోయారు.

భోజనాలకు డాబాపైన షామియాన వేసి విశాలంగా ఏర్పాట్లుచేశారు.

అందరూ పైకి వెళ్ళి కూర్చున్నారు.

అంతలో మైకునుంచి 'స్వామియే శరణం అయ్యప్పా' అని శరణం వినిపించిన తరువాత ఇలా పాటవినిపించసాగింది...

"ఏ కళ్ళు చూసినా అయ్యప్ప వాకిళ్ళే
ఏ ఇళ్ళు చూసినా అయ్యప్ప లోగిళ్ళే
... ... ...
... ... ...
నీ కొండకు రాలేని మా ఆడపడుచులలో
హృదయాలే కోవెలలై ఎదురు చూస్తున్నాయి
మకర జ్యోతి కనలేని ఆ తల్లుల గుండెలలో
అయ్యప్పా ఎల్లప్పుడు కొలువుండిపోవయ్యా"





పాట ఎంతో భావగర్భితంగా వుంది. అందరూ తన్మయత్వంతో వింటున్నారు. చాలా మందికి కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

ఆ పాటలోని భావానికి మంత్రముగ్ధులై కూర్చున్న తమ ముందుకి ఒకతను అప్పుడే అరవణం (పాసయం) తీసుకోని వచ్చి వడ్డిస్తూ "స్వామి శరణం భగవాన్ గారు, నమస్కారం ఉమగారు హలో మా కవిగారు, రేవతి కూడా వచ్చారన్న మాట చాలా సంతోషం" అంటున్న ఆయనకు మా ఉమ నన్నూ మా వారిని పరిచయం చేసింది.

ఆయన నా కళ్ళలోని ఒక్కసారి చూసి, "స్వామి శరణం? అరే మీరా? అయ్యప్ప ఎంత కరుణామయుడు. మీరు వెళ్ళే ముందు ఒక్కసారి కనిపించండి" అని వడ్డన సాగిస్తూ ముందుకి వెళ్ళిపోయారు.

"ఏమిటి ఉషా ఈయన నీకు తెలుసా" అనేసరికి కొంచెం కంగారుపడి అంతలో గుర్తుకు తెచ్చుకుని

"అవును పది రోజుల క్రితం నేను నిజామాబాద్ నుంచి వస్తుంటే బస్సులో చూశాను" అంతకు మించి తాను ఆరోజు ఆయన్ని గురించి ఊహించుకున్నదంతా చెప్పలేకపోయింది.

భోజన కార్యక్రమం ముగిసిన తరువాత అందరూ కిందికి దిగి వచ్చి ఆయనకు కృతజ్ఞతలు చెప్పి వెడుతున్నారు.

మెల్లిగా మేము ఆయనను సమీపించి నమస్కరించగానే, "చాలా సంతోషమండి. మీరంతా వచ్చి శ్రీ అయ్యప్పస్వామి పూజ చూసి ఆయన ప్రసాదం స్వీకరించి వెడుతున్నందులకు ఆనందంగా వున్నది. ఆ స్వామి చల్లని కరుణ మీ అందరి మీదా వుండాలని ఆ శబరి గిరీశుని మనసారా ప్రార్థిస్తున్నాను." అంటూ నిర్మలంగా చెబుతున్న ఆయనను చూసి ఉషా మనసులో ఎంతటి మంచి వ్యక్తిని గురించి ఆ రోజు నల్లని బట్టలు వేసుకున్నాడని, గడ్డం మాసిపోయిందని, కాళ్ళకు చెప్పులైనా వేసుకోలేదని ఎంతగా అవహేళనగా ఊహించుకున్నదో గుర్తుకు వచ్చి హృదయం పశ్చాత్తాపంతో నిండిపోయింది.


"ఆ స్వామిని దర్శించి, సేవించి, తరించే అసంఖ్యాక ప్రజాకోటిని చూస్తుంటే మనసు ప్రఫుల్లమవుతుంది.

"కుల, మత, వర్ణ, వర్గ విచక్షణా రహితుడైన ఆ కలియుగ వరదుని చూడటానికి ఆబాల గోపాలానికి అవకాశం కల్పించిన హరి హర పుత్రుడు ఆడవారి విషయంలో మాత్రం ఎందుకో చిన్న చూపు చూశాడు."

"భక్తిలోనూ, శక్తిలోనూ ఎవరికీ తీసిపోని ఆడపడుచుల విషయంలో కఠోర నిబంధనను పెట్టి, ఆ హరి హర పుత్రుని కనులారా చూసే అదృష్టానికి వారిని దూరం చేస్తున్నాడు."

ఆడవారిపట్ల ఇంతటి సోదరి వాత్సల్యం వున్న వ్యక్తి గురించి తను ఎంత అవివేకంగా ఊహించుకున్నదో? ఉష ఆలోచనల నిండా మనసు నిండా అయ్యప్పస్వామి ఊహలతో నిండిపోయి ఆమె విశాలనేత్రాలు మరింత ప్రకాశవంతమయినాయి.

ఆ సమయంలోనే ఆమె కళ్ళలోకి చూసిన అతను "ఉమాగారు మీ ఉషాగారి కళ్ళలో నేను ఆ రోజు బస్సులో చదివిన భావాలే ఇంతకు ముందు మీరు వినిపాట. నాచేత అంత చక్కని పాటను రాయించిన ఆ విశాలనయనాలు అయ్యప్పస్వామిని తప్పక వీక్షించగలవని నా నమ్మకము." అంటూ శలవు తీసుకుని మిగిలిన వారికి వీడ్కోలు చెప్పేందుకు వెళ్ళిపోయాడు. *



## దొంగ

"తెలిసో తెలియకో ఒకసారి దొంగతనం చేసిన వ్యక్తి జీవితంలో ఎప్పుడో ఒకప్పుడు పశ్చాత్తాప పడక తప్పదు" అన్నాడు భర్త భోజారావు.

"ఆ మాట నిజమే. మీ హృదయాన్ని దొంగిలించిన నేరానికి నేనిప్పుడు పశ్చాత్తాపపడుతున్నాను. కానీ లాభమేమిటే...?" అంది భార్య కాంతం.

—శ్రీ శారద (అమలాపురం)


నూతన ఉత్సాహవంతులైన పారిశ్రామిక వేత్తలకు సదావకాశము. మేము 7 నుంచి 50 టన్నులు/(24గంటలు) ఆయిలు దిగుబడినిచ్చే **ఆయిలు ఎక్సుపెల్లర్లు ఫిల్టరు ప్రెస్‌లు, డికార్టి కేటర్లు** మరియు **బేబి బాయిలర్లు** సప్లయి, బిగింపు, ట్రయిలు పద్ధతి మీద సప్లయి చేస్తాము.

A.P.S.F.C; N.S.I.C; BANKS, GRAMODAYA SCHEMES,

ద్వార 4, 6, 9, బోల్టులు ఆయిలు ఎక్సుపెల్లర్లు కూడ సప్లయి చేస్తాము.

పూర్తి వివరములకు : సంప్రదించండి/వ్రాయండి

మోహన్ ఎంటర్ ప్రైజెస్;

5-4-98,99/5, 1st FLOOR,

రాణీగంజ్ జిల్లా బస్ స్టాప్ ఎదురుగా,

యమ్.జి. రోడ్డు, సికిందరాబాద్ – 500 003.

Thinkers.



సకుటుంబంగా
చదువుకోడానికి
చక్కని కాలక్షేపానికి
ఆంధ్రభూమి
సచిత్ర మాస పత్రిక